పారిశుద్ధ్యం అస్తవ్యస్తం!

- భరించలేని దుర్వాసన
- తూతూ మంత్రంగా వ్యర్థాల తొలగింపు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. అధికారుల నిర్లక్ష్యంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. రోజుల తరబడి తీయకపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినాయకచవితి ఉత్సవాల సమయంలో వెలువడిన చెత్తను మాసబ్ చెరువు కట్టకు సమీపంలోని సర్వే నంబర్ 212లో 40 రోజుల పాటు వదిలేసిన విషయం అందరికి తెలిసిందే. సాక్షిలో కథనం ప్రచురించిన తరువాత ఆలస్యంగా నైనా మేల్కొన్న అధికార యంత్రాంగం శనివారం చెత్త తొలగింపు పనులను చేపట్టారు.

చెత్త మాత్రమే తొలగిస్తాం..

చెత్త తొలగింపు కోసం టెండర్లను పిలవడానికి నెల రోజులకు పైగా సమయం తీసుకున్న అధికారులు, పూర్తిగా పరిసరాలను శుభ్రం చేయకుండా తూతూ మంత్రంగా లారీలలో చెత్తను తొలగించి చేతులు దులుపుకున్నారు. రోజుల తరబడి ఆ ప్రాంతంలో చెత్త పేరుకుపోవడంతో డంపింగ్ యార్డ్‌ను తలపించేలా మారినా పట్టించుకోవడం లేదు. ఉత్సవాల సమయంలో వెలువడిన చెత్తను మాత్రమే తొలగిస్తాం. ఆ తరువాత మీ ఇష్టం అన్నట్లుగా పరిస్థితి దాపురించింది.

మాసబ్ చెరువు కట్టపైన..

మాసబ్ చెరువు కట్టపైన ఉన్నటువంటి పార్కుకు ప్రతిరోజూ వందల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. దీనికి తోడు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే సాగర్ రహదారికి పక్కన, సుమారు 20 కాలనీల ప్రజలు రాకపోకలు సాగించే చోట చెత్తను డంప్ చేస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే వారికి భరించలేని దుర్వాసనతో ముక్కు పుటాలు అదురుతుండటంతో అటు వైపు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఇకనైనా అధికారులు మొద్దు నిద్ర వీడి పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

“ వ్యర్థాలను సగం తొలగించి..

వ్యర్థాలను సగం మాత్రమే తొలగించి, పరిసరాలను శుభ్రం చేయకుండా వదిలేయడం వల్ల భరించలేని దుర్వాసన వెదజల్లుతుందనే విషయాన్ని మున్సిపాలిటి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత దృష్టికి తీసుకుపోగా ఆమె నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. – వనిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్

లక్ష్మయ్య సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీకి లక్ష్మయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఆదివారం వర్కాల లక్ష్మయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ పార్టీకోసం, ప్రజల కోసం లక్ష్మయ్య పనిచేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వర్కాల శ్రీనివాస్, పాండయ్య, ఆనంద్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు వస్పుల జంగయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు కోట కృష్ణయ్య, గాజుల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, మెకానిక్ బాబా, ఫరీద్, నర్సింహా, మైసయ్య, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు సంప్రదాయాలకు నిలయాలు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



తుల్జాభవానీ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

మాడ్గుల: ఆలయాలు, సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాజీవ్ నగార్ తండాలో తుల్జాభవానీ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండప పూజలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని భక్తిభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



ఆర్ఎస్ఎస్ కవాత్

ఆమనగల్లు: దేశ నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకుల క్రమశిక్షణ, సేవాభావం, ఐక్యత, దేశభక్తి విలువలు మరువలేనివని ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచార ప్రముఖ్ భాస్కరాచారి పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో ఆదివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిశుమందిర్ పాఠశాల నుంచి పట్టణంలోని జాతీయ రహదారి, ప్రధాన వీధుల్లో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు పథ సంచాలన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై పూలు చల్లి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, ఆమనగల్లు ఖండ కార్యావాహ ఆనంద్, స్వయం సేవకులు దొంతు విశ్వనాదం, తిరుపతి, మనోహర్, మాధవాచారి, పాతకోట శ్రీశైలం, ఎర్రవోలు మహేశ్, ఉప్పల నర్సింహా, మహేశ్, వంశీ, చిందం నరేశ్, గణేశ్, శ్రీకాంత్‌సింగ్, సుందూరు శేఖర్, లక్ష్మణ్, మల్లేశ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాకేశ్ కిషోర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి



యాచారంలో నిరసన చేపడుతున్న మహేశ్ తదితరులు

యాచారం: బీఆర్ గవాయిపై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిషోర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ శ్రేణులు డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు మూలి మహేశ్ ఆధ్వర్యంలో ఆదివారం యాచారంలోని అంబేడ్కర్ చౌరాస్తా వద్ద నిరసన చేపట్టారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేకపోతే న్యాయం ఎక్కడ ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మందలింగం, కొండల్, మస్కు మహేందర్, శంకర్, రమేశ్, ప్రసాద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

షాద్‌నగర్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అఫోజ్‌జహాన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక శీతాకాల శిబిరం ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని వీధులలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. స్వచ్ఛతపై నినాదాలు రాయడంతో పాటు పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దీంతో రోగాలు దరి చేరవన్నారు. చెత్తాచెదారం ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్తకుండీల్లో వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. మద్యంపానం, ధూమపానం, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అరుణఅంజయ్యగౌడ్, పంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్, అధ్యాపకులు కళాజ్యోతి, పరమేశ్వరి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్: మండల పరిధిలోని వెలిజర్లలో పోచమ్మ దేవాలయ నిర్మాణానికి గ్రామస్తులు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. దేవాలయాల నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాంగారి నర్సింహ, రవీందర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి

- ఏసీపీ రాజు
- విజయవంతంగా 2కే రన్



2కే రన్ ప్రారంభిస్తున్న ఏసీపీ రాజు, కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఏసీపీ రాజు పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నంలో పర్యావరణ పరిరక్షణ సమితి, చెట్టు అమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్, బెట్టింగ్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజి ఆచారి, కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, శ్రీను, ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐలు రామకృష్ణ, న్యాయవాది జగన్, బీజేపీ నాయకులు ముత్యాల మహేందర్, శివధర్‌రెడ్డి, ఆ సంస్థ చైర్మన్ దండు నరేశ్, ప్రతినిధులు దండు శ్రీనివాస్, కాసుల వెంకటేశ్, బీసీ ఉద్యమ నాయకులు బోయపల్లి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు నుంచి కాపాడాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న ఆపిల్ అవెన్యూ కాలనీ వాసులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు అలుగు పారి ముంపు ఏర్పడుతుందని, గడిచిన 5 ఏళ్లుగా వర్షాకాలంలో ఇళ్లు మునిగిపోతున్నాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ ఆదివారం ఇంజాపూర్‌లోని ఆపిల్ అవెన్యూ కాలనీ వాసులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వరద వచ్చిన సమయంలో రాకపోకలకు ఇబ్బంది తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వచ్చిన వరదకు అపార్ట్‌మెంట్ ప్రహరిని కూల్చివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు కాలనీ వాసులు పేర్కొన్నారు. అధికారులతో చర్చించి కాల్వ పరిశీలన అనంతరం అంచనాలను సిద్ధం చేస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్ గౌడ్, బొక్క వంశీదర్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు చెన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు వీరప్ప నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల సాధనకు అలుపెరగని పోరాటం



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఆమనగల్లు: బీసీ రిజర్వేషన్లు సాధించేందుకు అలుపెరగని పోరాటం చేస్తామని ఆమనగల్లు బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రకటించారు. ఆమనగల్లు పట్టణంలోని మాస్టర్స్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం బీసీ సంఘాల ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 14న బీసీ రిజర్వేషన్ల సాధనకు నిర్వహించనున్న రాష్ట్రబంద్‌కు సహకరించాలని కోరారు. అనంతరం ఐక్య వేదిక నాయకులు మాట్లాడారు. బీసీ సంఘాల నాయకులు సంఘటితంగా పోరాడి 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చుక్క అల్లాజీగౌడ్, తల్లోజు రామకృష్ణ, ఎంగలి బాలకృష్ణయ్య, అవ్వారి శివలింగం, నిరంజన్‌గౌడ్, కోట్ల వెంకటేశ్, ఆంజనేయులు, కాసోజు రాము, నాగిళ్ల జగన్, గాజుల శ్రీను, పరమేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ సమాజం కార్యవర్గం ఎన్నిక

షాద్‌నగర్: వీరశైవ సమాజం పట్టణ నూతన మహిళా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షురాలిగా పట్వారి వినీత, గౌరవాధ్యక్షురాలిగా కాట వనజ, ప్రధాన కార్యదర్శిగా పత్తిగిరి మాధవి, సహాయ కార్యదర్శిగా శర్వాణి, సభ్యులుగా అగ్గనూరి విశాల, బొబ్బిలి సంధ్య, ఆకుల నిర్మల, రేటికల్ మీన, శైలజ, లావణ్య, ఆకుల సరిత, హరిత, సంధ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం అధ్యక్షులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: వెల్జాలలో పోలియో చుక్కలు వేస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్



తుర్కయంజాల్: చుక్కల మందు వేస్తున్న కమిషనర్ అమరేందర్ రెడ్డి, వైద్య సిబ్బంది



యాచారం: చుక్కల మందు వేస్తున్న డాక్టర్ ప్రియాంక

పోలియో నిర్మూలన తప్పనిసరి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు చుక్కలమందు



ఆమనగల్లు: చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: పోలియో నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ పోలియోను నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. డా.మైమునాబేగం, మంజులాదేవి, విజయ మాట్లాడారు. 95 శాతం చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సిబ్బంది తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వరి, రవికుమార్, మాదవి తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో: వెల్జాల గ్రామంలో మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించి చుక్కల మందు వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ కోఆప్షన్ మెంబర్ ముజుబుర్ రెహమాన్, వైద్య సిబ్బంది సువర్ణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: 5 ఏళ్లు నిండిన ప్రతి చిన్న పిల్లలకు తప్పనిసరిగా చుక్కలు వేయించాలని కమిషనర్ కె. అమరేందర్ రెడ్డి కోరారు. పోలియో రహిత సమాజం కోసం కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో చుక్కల మందు కార్యక్రమాన్ని ప్రారంభించారు.



కడ్తాల్: చుక్కలు వేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్



మాడ్గుల: చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది



ఇబ్రహీంపట్నం: బస్టాండ్‌లో చిన్నారికి చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సుధా మాధవి



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్లలో చుక్కలు వేస్తున్న గోపాల్‌గౌడ్

క్లుప్తంగా

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్వప్న తదితరులు

ఆమనగల్లు: ఇబ్రహీంపట్నంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాల్గవ మహాసభలు ఈ నెల 26, 27తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం మహాసభల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకులు సబియాబేగం, పద్మ, లక్ష్మమ్మ, బుజ్జమ్మ, వరలక్ష్మి, శ్రీలత, సువర్ణ, రాములమ్మ, జంగమ్మ, యశోద తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలు తొలగించండి



రోడ్‌పై పేరుకుపోయిన చెత్త

మలక్‌పేట: మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్లలో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గంధంగా మారుతున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం సిబ్బంది నిర్లక్ష్యంతో కాలనీలన్నీ కంపు కొడుతున్నాయని ఆయా ప్రాంతాల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల వద్దకు వచ్చే చెత్త తరలింపు వాహనాలు కొన్ని ప్రాంతాలకే వెళ్తున్నాయని ఫుట్‌పాత్‌లపై పేరుకుపోయి చెత్తకుప్పలతో నడిచేందుకు వీలు లేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. శాలివాహననగర్, సలీంనగర్, ఎస్‌బీహెచ్‌కాలనీ ఈస్ట్‌ప్రశాంత్‌నగర్ ఫుట్‌పాత్‌లపై పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని కోరుతున్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

యాచారం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు ఆర్థిక సహాయం అందజేశారు. కుర్మిద్ద గ్రామానికి చెందిన సురిగి శ్రీనివాస్‌గౌడ్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2002–03 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కుర్మిద్ద గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు రూ. 1,25,000లు అందజేశారు. భవిష్యత్‌లో కూడా శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

మహా పాదయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అయ్యప్ప స్వామి భక్తులు

ఇబ్రహీంపట్నం: అయ్యప్ప స్వామి సన్నిధికి కాలినడకన వెళ్లే భక్తుల కోసం మహా పాదయాత్ర వాల్ పోస్టర్‌ను ఆదివారం ఇబ్రహీంపట్నంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. అజయ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ నెల 22న ఇబ్రహీంపట్నం నుంచి శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధికి కాలినడకన వెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో చందర్ నాయర్ స్వామి, ధనంజయ, శంకర్, వేణుగోపాల్, గోవర్ధన్, కొటచారి, విఘ్నేశ్వర్, భరత్, వెంకటేశ్, రాజు పాల్గొన్నారు.

అభినందన

షాద్‌నగర్: గ్రూప్–1 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన అనుమిత్రను బీజేపీ నేతలు అభినందించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య ఆధ్వర్యంలో నాయకులు పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో నివాసం ఉంటున్న ఆమె స్వగృహానికి వెళ్లి శాలువా కప్పి సత్కరించారు. భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు హరిభూషణ్ పటేల్, మల్చాలం మురళీ, నర్సింలు, రాము, కాసోజు శివకుమార్ తదిరతులు పాల్గొన్నారు.